# నన్ను వీడని నీ జ్ఞాపకం

అనిత వోజ్జల

సరిగ్గా మూడేళ్ళ క్రితం అనుకుంటా ఆ సంఘటన జరిగింది. అప్పుడు నాకు ఇరవై ఏళ్ళ వయసు—

ఉరకలేసే ఉత్సాహంలో ఎవరేమి చెప్పినా తలకెక్కేది కాదు. నేను స్వాభావికంగా తెలివికల



దాన్ని. అందులోనూ అప్పుడప్పుడే కవితలు, కథలు వ్రాస్తూ రచయిత్రిలా వృద్ధిలోకి వస్తున్న దాన్ని.

నా మొదటి కవిత ప్రింట్ అయినప్పుడు వచ్చిన లేఖలు చూస్తే నాకు ఆశ్చర్యం వేసింది. రీడర్స్ అంతగా రెస్పాన్స్ ఇస్తారని మేనసలు ఊహించలేదు. ఆ ఉత్తరాలను చదివినకొద్దీ ఎంతో థ్రిల్లింగ్‌గా ఫీలయ్యేదాన్ని. క్రమక్రమంగా నా కవితలు, కథలు పత్రికలో ప్రింట్ అయ్యేకొద్దీ నేను పోస్ట్‌మాన్ కోసం ఎదురుచూడ్డం, నాకు వ్రాసే అభిమానుల ఉత్తరాలు చదవడం నాకు హాబీ అయ్యింది.

కొన్ని ఉత్తరాలకు రిప్లయి వ్రాయాలనిపించినా, నేను అప్పటికే బాధ్యతాయుతమైన ఉద్యోగంలో ఉండడం వలనో సాయంత్రాలలో కథలు వ్రాయటానికే టైమ్ సరిపోకపోవడం వల్లో రిప్లయి ఇచ్చేదాన్ని కాదు.

ఎందుకో నాకు వచ్చే ఉత్తరాలలో ఎక్కువగా అబ్బాయిల నుండే వచ్చేవి. అందులోనూ కొంతమంది నేను వ్రాసే సాహిత్యం గురించి మాత్రమే కాక నన్ను కూడా వర్ణించేవారు. నాకు చాలా నవ్వొచ్చేది. నేను వ్రాసిన నాలుగు ముక్కలలో వీరికి నా వ్యక్తిత్వం ఎలా అర్థం అయ్యేదో నాకు తెలిసేది కాదు. అందులోనూ ఒక హత్య గురించి వ్రాయదలచుకుంటే హత్యచేసి వ్రాయనవసరం లేదని బహుశ మన పాఠకులకు కొంతమందికి తెలియదనుకుంటా.

ఆ రోజు నాకు వచ్చిన ఉత్తరం నాకు ఆశ్చర్యాన్ని మాత్రమే కాక ఆనందాన్ని కూడా కల్గించింది. ఎందుకంటే అది అమ్మాయి వ్రాసిన ఉత్తరం. ఇక ముందు వెనుక ఆలోచించకుండా ఆ ఉత్తరానికి ఎంతో శ్రద్ధగా సమయాన్ని కేటాయించి లెటర్ వ్రాసాను.

వారం తిరిగేసరికి ఆ అమ్మాయి నుండి లెటర్ వచ్చింది. అలా ఉత్తరాల ద్వారా పరిచయమైన మేము ఓ ఆర్నెల్లు పాటు కలం స్నేహం చేసాక ఓసారి కలుసుకోవాలనుకున్నాము.

ఇంతకి నేను ఆశ్చర్యపోయేదేంటంటే ఆ అమ్మాయి అసలు అమ్మాయి కాదు. అమ్మాయి పేరిట ఉత్తరం వ్రాసిన అబ్బాయి అని మేము మొదటిసారి కలుసుకున్నప్పుడు తెలిసింది.

ఫలానా హోటల్‌కు రమ్మన్నప్పుడు నేను వెళ్ళాను. పత్రికల్లో నా ఫోటో చూడడం వలన అతను నన్ను గుర్తుపట్టి పలకరించి అసలు విషయం చెప్పాడు.

మొదట నాకు కోపం వచ్చినా అతని ఛార్మింగ్ పర్సనాలిటీ, ఇంటలిజెన్స్, సెన్సాఫ్ హ్యూమర్ యొక్క ఆకర్షణలో పడి నేను ఆ విషయాన్ని అంతగా పట్టించుకోలేదు. అందులోనూ అతను కూడా రచయితనే.

ఏదో థ్రిల్లింగ్ కోసం అలా రాసాడు అని సరిపెట్టుకోకుండా అప్పుడు, కొంచెం ఆలోచించినా బాగుండేది కావచ్చు. ఇద్దరం ఒకే ఊళ్ళో ఉండటం వలన అలా పెరిగిన మా పరిచయం రోజురోజుకు అభివృద్ధి చెందింది.

ప్రేమించుకోవడమంటే కలిసి పార్కులు తిరగడం, ఒకే కూల్‌డ్రింక్ బాటిల్‌లో రెండు స్ట్రాలు వేసి త్రాగడం లాంటివి కాకుండా మేమిద్దరం రచయితలము అవ్వడం వల్ల పరస్పరం స్నేహితులు లాగానే ఉంటూ మా ప్రేమను వ్యక్తం చేసుకున్నాం. త్వరలో పెళ్ళి కూడా చేసుకోవాలనుకున్నాం.

అనుకున్నట్టుగానే మా తల్లిదండ్రులు మా పెళ్ళికి ఒప్పుకున్నారు. కాని అసలు ప్రాబ్లమ్ వచ్చింది వరకట్నం విషయంలో. అప్పుడు సందీప్ కూడా కట్నం కోసం డిమాండ్ చేయడం నాకు ఆశ్చర్యం అనిపించింది. నా తల్లిదండ్రులు కట్నం ఇవ్వడానికి సుముఖంగానే ఉన్నా ఇప్పుడు సందీప్‌ను పెళ్ళి చేసుకోవడానికి నేను ఒప్పుకోలేదు. ప్రేమించినవాడిని నీ చేతులతో నీవే దూరం చేసుకుంటున్నావని నా స్నేహితురాళ్ళు అన్నప్పుడు వారిపై నాకు జాలి వేసింది. అలా నేను, సందీప్ దూరమయ్యాం. సందీప్ వ్యక్తిత్వాన్ని అంత తక్కువగా అంచనా వేసినందుకు నాపై నాకే కోపం వచ్చింది. నాకు సరియైన వరుడు దొరికేవరకు నేను పెళ్ళిచేసుకో కూడదనుకున్నాను.

అంతలోనే నా వ్యక్తిత్వానికి సరిపడ వ్యక్తి దొరకడంతో నా పెళ్ళి జరిగిపోయింది ఆ మరుసటి సంవత్సరం.

క్రమక్రమంగా నేను సందీప్‌ను మరచిపోవడం... నేర్చుకుంటున్న తరుణంలో ఈనాడు సందీప్ వరకట్న నిషేధంపై వ్రాసిన కథకు మొదటి బహుమతి వచ్చినందుకు అతని జ్ఞాపకం ఓ అపశృతిలా నా మదిలో నిలిచిపోయింది. ■